

# యవ్వన వార్ధక్యం

ఇందుర్తి సత్యనారాయణరావ్

ఎవరో ఏడుస్తున్నారు, గొంతు చించు కొని, చెవులు పగిలేట్లు. భరించలేక లేచి అటు పరిగెత్తాను. ఆ రోదిస్తూన్న స్త్రీని చూడగలిగాను! వెక్కి వెక్కి

ఏడుస్తుంది హృదయ విదారకంగా. విచిత్ర మేవిటంటే ఆమె చాలా అదం గాను, అతి దీనంగాను వుంది.

"ఎవరమ్మా నువ్వు? ఎందు కేడుస్తు న్నావు?" అడిగాను.

యింకా బిగ్గరగా ఏడవసాగింది!

"చెప్పమ్మా! నీ కొచ్చిన కష్టమేంటో నాతో చెప్పు! నేను సరిచేస్తాను." అడిగాను లాలనగా.

ఆమె తలెత్తి నా కేసి సూటిగా చూసింది. కళ్ళు బాగా వాచి ఎర్రగా వున్నై.

"నే నెవరో తెలుసుకోలేనివాడివి, నా కష్టాన్నేమి అర్థం చేసుకోగలవు?" కోపంగా అడిగి తిరిగి ఆక్రోశించ సాగింది.

"ఎవరు? ఎవరీమె!" ఆలోచిస్తూండగానే నాకు మెలకువ వచ్చింది. వళ్ళంతా చెమటతో; గుండె అంతా బరువుతో నిండిపోయాయి.

"కలలో కనిపించిన స్త్రీ నాకు తెల్సా?" యేమోగాని ఎంత ఆలోచించినా నాకు గుర్తురాలేదు, తిరిగి నిద్రా పట్టలేదు.

ఎట్లాగూ అయిదు గంటలైంది, ఆరు గంటల్నుంచి ఆనాటి నా కార్యక్రమాలు మొదలౌతై గనుక, లేచి గబగబా తయారవసాగాను. ఆ గంటసేపూ నే నేం చేస్తున్నా ఆ కల తాలూకు జ్ఞాపకాలు నన్నొదల్లేదు.

నేను కట్టిస్తూన్న వంతెనకు పెద్ద పరిమాణంలో కంకర కావల్సివచ్చింది. నా సివిలు యింజనీరు శ్రీకాంతు, యితర సహాయకులతో సరిగ్గా అదే ఉదయం ఏడు గంటలకు అక్కడికి దగ్గరగావున్న కొండమీదకి వెళ్ళాను; అక్కడి రాళ్ళు వాసి, రాసి నా పనికి సరిపోతుందేమో చూసుకోడానికి.

ఆ కొండమీదకు ఎక్కుతుండగానే చెప్పాడు శ్రీకాంతు– "అక్కడి రాయి మా పనికి సరిపోయినా, దాన్ని రవాణా చేయడం ఆర్థికంగా లాభదాయకం కాదని."

కారణం– ఆ కొండమీదకు నడిచి వెళ్ళడమే కష్టంగా ఉన్నప్పుడు, అక్కడ కూలీలను పెట్టి కంకర కొట్టించడం, దాన్ని లారీలద్వారా వంతెన నిర్మించే స్థలానికి రవాణాచేయడం కష్టమేకాక ఖర్చుతో కూడుకొన్న పని.

అయినా అధికారులకు మాటయిచ్చిన ప్రకారం–కొంత లాభం తగ్గినా–అక్కడి రాయి నాకు సరిపోయి, వీలయి నా పని శీఘ్రతరంగా ముగిసే పక్షంలో దానినే వుపయోగిద్దామన్న ఆలోచనతో యింకొంత పైకివెళ్ళాం.

కానీ– అక్కడి నల్లరాయి చాలా గట్టిదిగా వుండి యినుములా తోచింది మాకు. దానిని మామూలు కూలీలతో కంకరగా కొట్టించడం సాధ్యమయే పనికాదు.

పొద్దుట వచ్చిన కలే నన్ను కలవర పెడుతూంటే, యీ పనికూడా సానుకూల పడక నన్ను చిరాకుపరచింది. దానికి తోడు వచ్చిన నల్లురం వచ్చిన దారి తప్పాం.

"యిలా వెళ్ళినా కొండకిందకు చేరు కోవచ్చు" అంటూ మాకు ధైర్యం చెప్ప సాగాడు నా సహాయకులలో వొకడైన కమలాకరం.

"సరే కానియ్యి" మని అతని వెనకే నడుస్తూ వస్తున్న మాకు, దారి పోను పోను మరీ దుర్భరమై నడవడానికి వీలు లేకుండా అయింది.

అయినా తప్పదు గనుక అలానే పడుతూ లేస్తూ కొండ దిగసాగాం.

యింతలో- "అబ్బా! ఏంటిది?" అంటూ అర్చాడు మా పక్కగా వస్తున్న శ్రీకాంతు. అంచరం అటు తిరిగాం. అక్కడ!!

రెండు కొండరాళ్ళ మధ్య ఒక అద్భుతమైన శిల్పం మాకు కనిపించింది.

అయిదున్నర అడుగుల ఎత్తులో; పూర్తి యవ్వనంలో వున్న స్త్రీకి శిలా రూపమది. ఒక అత్యద్భుత సౌందర్యం అక్కడ నిలిచినట్లుగా వుందిగాని వొక శిల్పంలా లేదా రూపం.

"లక్ష్మీదేవీ!" అన్నాడు కమలాకరం.

పరిశీలనగా చూసాను విగ్రహాన్ని- "ఔను! అది లక్ష్మీదేవి విగ్రహమే!"

"ఎంత బాగుంది! ఎవరు చేసారు దీన్ని" గొణిగాను గట్టిగా.

"ఇంత అద్భుతంగా శిల్పించడం మానవ సాధ్యమా? సాక్షాత్తు శ్రీలక్ష్మే యిక్కడ వెలసింది." అంటూ ఆ విగ్రహం పాదాలముందు మోకరిల్లాడు విశ్వనాథం.

"లక్ష్మీం క్షీర సముద్రరాజ తనయాం" అంటూ ప్రారంభించాడు రామనాథం.

"శ్రీరంగ ధామేశ్వరీం" అని అందు కొన్నాడు కమలాకరం.

శ్రీకాంతు శ్లోకాలైతే చదవలేదు గాని ఆ శిలారూపానికి భక్తితో నమ స్కారం చేస్తున్నాడు. నేను దీక్షగా ఆ శిల్పాన్నే చూడసాగాను. నా హృద యంలో కదలిక మొదలైంది. ఉదయపు నా కలకు రూపం తెలుస్తుంది.

"ఔను! లక్ష్మీదేవి నాకు కనిపించింది ఉదయం. ఎండలో, వానలో కష్టపడు తున్న తనను గుర్తుపట్టమని హెచ్చరిం చింది. యింతకంటే దృష్టాంతం యింకేం కావాలి?"

నా మనసు భక్తితో నిండిపోయింది. ఆ కల, యీ శిల్పం- రెండూ కాకతాళీ యాలు కావు. నాకు బాగా నమ్మకం కలి గింది 'శ్రీమహాలక్ష్మీదేవే అక్కడ సాక్షా త్కరించింద'ని ఆమె నాకు కలలో కనిపించడం నాకు చాలా గర్వాన్ని కలి గించింది. అంతదాకా 'దేవుడున్నాడా, లేడా' అనే నా మీమాంసకు సమాధానం దొరికింది.

నా సహచరులు నలుగురు కాస్త ఆ

విభ్రమంనించి తేరుకోగానే- వారు అది నమ్ముతారా అనే అనుమానం వున్నా- ఉదయం నాకు వచ్చిన కలను గురించి వివరించాను. కానీ నేను చెప్పిన విషయం వారు మనస్ఫూర్తిగాను, యధాతథంగాను నమ్మేశారు.

అంతేగాక 'నావంటి సచ్చరిత్రులకు యిలా దర్శనమీయడంలో ఆశ్చర్యమేవీలేదని' ఘంటాపథంగా చెప్పారు.

మా అందరి మనసులు ఆనందంతో నిండిపోయాయి.

"తర్వాతి కార్యక్రమం యేవిటి?" అడిగాను.

"సాక్షాత్తు శ్రీలక్ష్మి తన ప్రియభక్తుడైన మీకు దర్శనం యిచ్చిన తర్వాత మిగిలిన కార్యక్రమాలు వాటంతట అవే జరిగిపోతాయి." అంటూ కమలాకరం విగ్రహంచుట్టూ శుభ్రం చేయసాగాడు రామనాథం. విశ్వనాథం అతనితో జత కల్పాడు.

"మనం ఎలా గో లా కిందకు చేరుకొని, కారులో ఊర్లోకి వెళ్ళి, పెద్దలందరికీ- యీ విషయం తెలియజేద్దాం." అన్నాడు శ్రీకాంతు.

"ఔనౌను! అలాగే వెళ్ళండి-గుడిలోని పూజారులను; పురోహితులనీ, బ్రాహ్మణులను యిక్కడికి పంపండి పూజాసామాగ్రితో-" అని నాతో

"అయ్యా! తమరు తిరిగి ఓ గంటలో ఊరి పెద్దలతో యిక్కడికి రండి" అన్నాడు విశ్వనాథం.

* * *

నాలుగు రోజుల్లో ఆ కొండరూపమే మారిపోయింది. కిందనించి కొండపైకి చక్కని కాలిబాట యేర్పడింది. నిర్జనంగా ఉండే ఆ ప్రదేశం వేలాదిమంది భక్తులతో కిటకిటలాడుతుంది. ఆ ప్రదేశాన్ని తాత్కాలికంగా కొంత మేరకు చదునుచేయడం జరిగింది. ఊరిలోని పెద్దలు ఆ నాల్గురోజులూ అక్కడే ఉండి, ఆ శిలారూపానికి సంప్రోక్షణాది కార్యక్రమాలు జరిపి, విగ్రహంచుట్టూ తాటాకులతో, పైన రేకుల కప్పుతో గది నిర్మించారు. కానుకలకోసం పెద్ద హుండీ వుంచబడింది!

పూర్వం ఒక ధనవంతుడిగా నాకుండిన గుర్తింపు, గొప్ప భక్తుడిగా మారి గౌరవాన్ని ఆపాదించింది.

కానీ- ఆ నాలుగు రోజుల్లో, ఆ విగ్రహాన్ని ఏకాగ్రతతో చూస్తుండబట్టో, మరే యితర కారణంచేతో నే నెక్కడో ఘోరంగా పొరపడినట్లు మనసు వ్యాకులపడసాగింది. 'నాకు ఆనాడు కలలో కనిపించిన స్త్రీ లక్ష్మీదేవి కాదేమో, ఏదో కాకతాళీయంగా జరిగిన యీ సంఘటనకు ముడిపెట్టానేమో' ననిపించసాగింది. కానీ అంతలోకే నాలోని ఏ శక్తో యీ విగ్రహానికి, ఆ కలకీ ఏవో సంబంధం వుంది తీరిందని గట్టిగా చెప్పసాగింది.

నాలోని సంఘర్షణ సద్దుమణిగింది. యిక నా బాధ్యతను నిర్వర్తించడానికి ఉద్యుక్తుడ్నయ్యాను.

ఊరిలోని ధనికులందర్నీ పిల్చి సమావేశపర్చాను. కొండమీద వెలసిన లక్ష్మీదేవికోసం ఆలయం నిర్మించాలన్న నా వుద్దేశాన్ని వెల్లడించాను. అందరూ వెంటనే తమ సమ్మతి తెలిపి, వారివారి విరాళాలను ప్రకటించారు. కాని నా వ్యాపారాలలో చాలా వాటిలో భాగస్థుడైన శేఖరం మాత్రం, యీ ఆలయ నిర్మాణానికి చిల్లిగవ్వ కూడా యివ్వనన్నాడు. అయినా రెండు లక్షల రూపాయలకు విరాళాలు ప్రమాణం చేయబడ్డాయి– 'ఒక మోస్తరు ఆలయం నిర్మించవచ్చు, తర్వాత ఆలయం మీద ఆదాయంతో, దానిని అభివృద్ధి చేయవచ్చు' అని నిర్ణయించుకొన్నాం. యీ పనులు నిర్వహించడానికి ఓ సంఘం యేర్పాటు చేయడానికికూడా తీర్మానం జరిగింది!

ఆ రాత్రి హాయిగా నిద్రపట్టింది నాకు–

తిరిగి అదే ఆక్రందన! గుబులు పుట్టించే విధంగా రోదన! గబగబా అటు కదిలాను.

ఆమె ఏడుస్తూంది నన్నే చూస్తూ!

"ఏమిటిది? యెందుకు యీమిలా బాధపడుతూంది?" నా గుండె బరువెక్కసాగింది.

యింతలో ఆమే అడిగింది–"ఎప్పటికి గుర్తిస్తావు నన్ను? ఎన్నడు నాకీ చెరసాల నించి విముక్తి?" అని విలపిస్తూ.

"నీవు లక్ష్మీదేవివి కావూ? ఎవరు బంధించారు నిన్ను?" అని నేను అడుగుతుండగా ఆమె అదృశ్యం కావడమో, నాకు మెలకువ రావడమో జరిగింది.

ఎంత ఆశ్చర్యం! ఒకే వరుసలో రెండు కలలు రావడం సాధ్యమా? యీమె లక్ష్మీదేవి కాకపోతే మరెవరు? యీమె నెవరో బంధించడమేవిటి? యీ కలకి యేదో అర్థం తప్పసరిగా వుంది– ఏమిటది?

మర్నాడు పొద్దుటే కొండమీదికి వెళ్ళాను. అప్పటికే జనం నిండిపోయారా ప్రదేశమంతా. ఏవో పద్యాలు, శ్లోకాలు, మంత్రాలు, నినాదాలు.

నాకు గల ప్రత్యేకతవల్ల సులభంగా ఆ విగ్రహాన్ని చేరుకోగలిగాను. ఆ విగ్రహం పక్కనే నించొని తదేకంగా చూడసాగాను.

గంట– రెండు గంటలు.

నా పరిశీలనలో– ఆ కలకీ, ఈ విగ్రహానికి ఏదో సామీప్యం, ఎందులోనో భేదం.

ఆ గందరగోళంలో, కోలాహలంలో నేను స్థిరంగా ఆలోచించలేకపోతున్నాను. నా సందేహాలకు జవాబు కావాలంటే ప్రశాంతంగా వుండే ప్రదేశానికి వెళ్ళి, ఏకాగ్రతతో ఆలోచించాలి. అక్కడ్నించి బైటకొచ్చేసాను. నా సహచరులు నన్ననుసరిస్తుంటే, వారించి, ఆ కొండకు అవతల పక్కనున్న

వైపుకు సాగాను తీవ్రంగా ఆలోచిస్తూ. ముళ్ళపొదల్లోంచి, రాళ్ళ మధ్యలోంచి అలానే నడుస్తూ నిర్జన ప్రదేశానికి చేరు కొన్న నాకు- ఎవరో వృద్ధుడు తడబడే అడుగులతో ఎదురు రావడం కనిపించి ఆశ్చర్యపోయాను.

కొంతసేపటికి అతను నన్ను సమీ పించి 'ఎవరూ ?' అని అడిగాడు.

అతనిని పరిశీలనగా చూసాను. ఏమాత్రం ప్రత్యేకతలేని ఆ వృద్ధుడిలో నన్నమితంగా ఆకర్షించినవి కళ్ళు. అవి విపరీతమైన కాంతితో వెలుగుతూ, అతనిలో ఏదో గొప్పతన ముందనిపింప చేసాయి.

ఆయనకు నన్ను పరిచయం చేసు కొన్నాయి.

"తమరెవరు ? యీ ఏకాంత ప్రదే శంలో ఏం చేస్తున్నారు ?" అడిగాను. —కుతూహలంగా.

నా ప్రశ్న వినకుండా—" ఏమిటి ఆ శబ్దం, కొండకి అవతలి వైపు నించి ?" అని అడిగాడు. ఆ వయసులో కూడా ఆయన యింద్రియశక్తి బాగానే వుందని గ్రహించాను.

"భక్తులు" చెప్పాను.

"భక్తులా ?"

"అవును; నాలుగు రోజుల క్రితం- అక్కడ వెలసిన లక్ష్మీదేవిని-కను గొన్నాం. ఆ రోజునించి భక్తులతో కొండ ముందరి భాగం నిండిపోయింది. త్వరలో అక్కడో ఆలయం నిర్మిద్దా మనుకొంటున్నాం."

ఆ వృద్ధుడు నవ్వాడు, పకపకా.

"లక్ష్మీదేవి వెలసిందా ?"

"ఔను" అన్నాను యిబ్బందిగా.

"ఉత్తరం వైపుగా వున్న రెండు కొండరాళ్ళ మధ్యనేనా ?"

"ఔను. మీరింతకు ముందే కనుగొ న్నారా ?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆ శిల్పం చెక్కింది నేనే !"

"మీరు శిల్పించారా ! లక్ష్మీదేవి స్వయంగా అక్కడ వెలసిందని అను కొన్నాం !"

వృద్ధుడు పకపకా నవ్వాడు !

"స్వామీ, ఎవరు మీరు ! ఆ విగ్ర హాన్ని మీరు తయారుచేసారా ? ఎవరు సంచరించని యీ ప్రదేశంలో ఎందుకు చెక్కారు దాన్ని మీరు ? వివరంగా చెప్పండి" అడిగాను ఆశ్చర్యంలో తల మునకలౌతూ.

"బాబూ! వారం రోజుల్నించి నాకు జ్వరంవచ్చి గుహలోంచి కదలడంలేదు. అందుకే యీ సందడంతా నాకు తెలియ లేదు. యీ రోజే బైటకొచ్చాను."

"గుహా ...!?" అడిగాను.

"ఔను ! ఆ ఎదురుగా కనిపిస్తుందే, ఆ గుహలోనే నా మకాం....రా....వచ్చి వొకసారి చూద్దువుగాని, నీకు చాలా విష యాలు బోధపడతై."

"వారం నించి గుహలోనే వుండి

పో యా రా! మరేం తింటున్నా రిన్ని రోజులూ?" అడుగుతూ ఆయ న్ననుస రించాను.

"నేను బంగారు భోజనం చేయలే దేనాడూ.... యిరవై యేళ్ళుగా గంజి మాత్రమే తాగుతున్నాను. దానికి సరి పోను నూకలు కూడా అయిపోగానే బయల్దేరానీ రోజు." యిద్దరం గుహలో ప్రవేశించాం. ఆయన దీపం వెలగిం చాడు.

ఒక చింకి చాపా, కొన్ని యిత్తడి గిన్నెలు, శిల్పాలు చెక్కే పరికరాలూ, రెండు మూడు చక్కని చిన్న శిల్పాలు చిందరవందరగా వున్నై ఆ గుహలో.


తిరిగి ఆయనే చెప్పసాగాడు— "నా తండ్రి గొప్ప శిల్పి. చిన్నతనం నించి అయనతో తిరుగుతూ, ఆయన దగ్గర నేర్చుకొని, నేనూ అంత గొప్ప శిల్పి నయ్యాను. ఆ రోజుల్లో నా సంపాదన బాగానే వుండేది.

కానీ—రాను రాను నా రాబడి తగ్గి పోయింది. పూర్వం రోజుల్లోలా రాజభవ నాలు సభామండపాలు నిర్మించబడటం లేదు. యిళ్ళలో అలంకరించుకొనే స్థాయికి యీ కళ అభివృద్ధి చెందలేదు- ఖర్చు, కొలతల విషయంలో, ఏనాడూ చాలా మటుకు మా విద్య కేవలం దేవా లయ నిర్మాణానికే పరిమితమైంది. వాటినా కొత్తగా నిర్మించడం తక్కువై పోయింది. అక్కడక్కడా జరుగు తున్నా ముఖ్యమైన విగ్రహం తప్ప, గతంలోలా ఆలయమంతా రాతి శిల్పా లతో నిర్మించబడటం లేదు.

"పనులు లేక నా పరిస్థితి హీనంగా తయారైంది. అంతదాకా వృత్తిగా కూడుబెట్టిన నా కళను నేను వదిలేయ వలసి వచ్చింది. బహుశా యిట్లాంటి కారణాలవల్లనేమో, యిదివరకటంతటి గొప్ప శిల్పులు యిప్పుడు కనిపించడం లేదు. యీ క్రింది గ్రామంలో కూలీ నాలీ చేసి నా జీవితం లాగుతున్నా, యీ కొండ మీది రాయి నా కళను మేల్కొ ల్పింది. పగలంతా కింద పనిచేసి రాత్రిళ్ళు విగ్రహాలు చెక్కడానికి నిర్ణ యించుకొన్నాను.

"ఆరు నెలలుగా నువ్వు యిప్పుడం టున్న విగ్రహాన్ని చెక్కుతున్నాను. పది రోజుల క్రితం అది పూర్తయింది. యిక్కడి దాకా పెద్ద ఖర్చు లేదుగాని, ఆ విగ్రహానికి కొన్ని ప్రత్యేకమైన పరిక రాలూ, పదార్థాలూ వాడితే చక్కని ఆకృతి వస్తుంది. కానీ అందుక్కావ ల్సిన ధనం లేదు నా వద్ద. అందుకే దాని నలా వదిలేసాను. వారం రోజులుగా బైటకు వెళ్ళకపోవడంవల్ల ఆ అసంపూర్ణ విగ్రహం పొందిన ప్రచారం నాకు తెలియలేదు" అంటూ ఆగాడాయన.

ఆయన మాటలవల్ల నాలో చెలరేగు తూన్న ప్రశ్నలకు సమాధానాలు అర్థ మయీ, కాకుండా వున్నై. అంతదాకా




అస్పష్టంగా కనిపిస్తున్న రూపమేదో ఒక్కొక్క తెరనూ చించుకొని కొంత మేరకు కనిపిస్తుంది.

"నాతో రండి" అభ్యర్థించానాయన్ను.

"ఎక్కడికి?"

"మా యింటికి."

"ఎందుకు?"

"ఊళ్లోవాళ్ళకు మిమ్మల్ని పరిచయం చేస్తాను."

"ఎందుకు?"

"యిప్పటికే ఆ లక్ష్మీదేవి వెలసిందన్న ప్రచారంలో ముఖ్యపాత్ర వహించాను. నాకు తెలియకుండానే ప్రజలకు భ్రాంతి కల్పించాను. యిప్పుడు నేను కాదన్నా ఎవరూ ఆ మాయలోంచి బైటపడరు. నాతో వచ్చి....లోకానికి నిజాన్ని తెలియబరచడంలో నాకు సహాయం చేయండి." అడిగాను నమ్రతగా.

కొంచెంసేపు ఆలోచించి 'పద' అంటూ కదిలాడాయన.

ఆయనతోపాటు కొండదిగి వస్తున్న నాకు బాధకలిగింది- ప్రజలను భ్రాంతిలో ముంచినందుకేమో. కాని ఆ బాధలో కూడా తెలియని సంతోషం- ఏమిటది?

నా మేధస్సు తళుక్కున మెరిసింది!

నాకు కలలో కనిపించిన స్త్రీ ఎవరో తెలిసింది!!

• • •

కిందకు దిగివచ్చిన తర్వాత ఊరిలోని ధనవంతులను, మిగిలిన పెద్దలను పిలిపించి సమావేశపర్చాను. అందరికీ నా పక్కన కూర్చున్న వృద్ధుణ్ణి చూపి-

"యిప్పుడు నేను పరిచయంచేస్తున్న మహాశయుడు గొప్ప శిల్పి! కొండమీది లక్ష్మీదేవి విగ్రహాన్ని చెక్కింది యీయనే" అన్నాను.

పెద్ద సంచలనం.... గుసగుసలు.

"మనం- లక్ష్మీదేవి తనతంట తనే వెలసిందని ఘోరంగా పొరపాటుపడ్డాం! యీ కాలంలోకూడా యిలాంటివి జరుగుతయ్యని గుడ్డిగా నమ్మినందుకు మనం సిగ్గుపడాల్సిన అవసరంలేదు; ఆ విగ్రహాన్ని అంత మహత్తరంగా చెక్కిన శిల్పి గొప్పతనాన్ని గుర్తించినందుకు సంతోషించాలి తప్పితే" అని ఆగాను.

"మన సంతోషాని దేముందిలెండి! విగ్రహం వెలసిందన్నారు.... సరేనన్నాం.... వందల మైళ్ళనించి వేల మంది భక్తులు వచ్చారు, దర్శించారు. ఆ విగ్రహానికి మూఢంగా యేవేవో మహాత్మ్యలంటగట్టారు.... యిప్పుడు కాదంటే జనం బతకనిస్తారా! ఏదో అనుకొన్న ప్రకారం ఆలయం నిర్మించేద్దాం.... యీ రహస్యం మనలోనే దాద్దాం....శిల్పాలను చెక్కించి-సంప్రోక్షణా, ప్రతిష్టా చేయించి ఆలయాలు కట్టిస్తూనే వున్నారు. పొరపాటునో, శిల్పి గొప్పవల్లో, విగ్రహం కనిపించిన ప్రదేశంవల్లనో, యింకో అందుకో మనం విగ్రహం సాక్షాత్తు వెలసిందనే అన్నాం. అందువల్ల ప్రజలలో భక్తి భావం పెరుగుతుందేగాని,తరగదు గదా! యిప్పుడు అనవసరంగా రసాభాస చేయొద్దు" అన్నారు కోటేశ్వర్రావుగారు.

"కుదరదు.... ప్రజల్ని మోసగించడం నావల్ల కాదు. విగ్రహం చెక్కబడినదేనని మన పొరపాటును వొప్పుకొందాం. అయినా ప్రజలు ఆలయాన్ని, విగ్రహాన్ని నమ్మితే గుడి కట్టిద్దాం. అంతేగాని ఎవరో ఏదో చేస్తారని, మన పొరపాటును మోసంగా మార్చుకోవద్దు.... అందులో దైవకార్యంలో" అన్నారు శ్రీనాథశాస్త్రి.

పావుగంటలో కొంద రదని, కొంద రిదని వాదించుకొన్నారు. తర్వాత నేను చెప్పాను-

"ఆలయ నిర్మాణం మాట ఉపసంహరించుకొందాం. ప్రజలకీ, ప్రభుత్వానికీ మన పొరపాటు: అదెలా జరిగిందో వివరిద్దాం.

"పోతే- ప్రస్తుతం మనం విరాళాలుగా ప్రకటించిన ధనంతో- శిల్పకారుల కోసం ఒక శిక్షణాకేంద్రం, దానికి అనుబంధంగా- ప్రస్తుతం ఆర్థికంగా హీన స్థితిలో వున్న మన శిల్పకారులకోసం ఒక ఆశ్రమం నిర్మించి, వారిచేత శిల్పాలు చెక్కిద్దాం. మన కొండమీద వున్న రాయి శిల్పానికి చాలా బాగా వుంటుందని యీ మహాశయుడు చెబుతున్నాడు గనుక యీ కార్యక్రమాలు అమలుచేయడానికి మన వూరు చాలా అనుకూలంగా వుంటుంది" అన్నాను.

మళ్లీ సంచలనం.... గుసగుసలు

"ఏడిసినట్టుంది.... మీరు చెప్పినట్టే ఆలయనిర్మాణం ఆపేద్దాం. గుడికట్టినా యింత అభాసు జరిగిన్తర్వాత ఎవరికీ అందులో భక్తి వుండదు గనుక ప్రయోజనం లేదు.... యికపోతే ఆశ్రమం, శిక్షణాకేంద్రం అంటున్నారే- వాటికి ప్రభుత్వం వుంది. వారే చూసుకొంటారవన్నీ- ఏదో దేవాలయం కదాని ఎలాగో డబ్బు సర్దుబాటు చేస్తామన్నామేగాని యిలాంటి వాటికి మా వద్ద ధనం చెల్లిక్కాయడం లేదు." ఖండితంగా చెప్పేశాడు ఆనందరావు.

అయిదు నిమిషాల్లో నే నేం చెప్పినా వినకుండా, అవునంటే అవునని అంతా లేచి వెళ్ళిపోయారు. నిర్వీర్యమైన ముఖంతో నేను, చిరునవ్వుతో ఆ వృద్ధుడూ మిగిలిపోయాం.


* * *

నాలుగు రోజుల తర్వాత ఆ సాయంత్రం తిరిగి నేనొక్కడ్నే ఆ కొండమీద విగ్రహం దగ్గరి కెళ్ళాను.

నాల్గు రోజులక్రితం జనంతో కిటకిటలాడిన ఆ ప్రదేశంలో చీమలుకూడా తిరగడంలేదు।

పూజారులు, పురోహితులూ లేరు। పూజాసామాగ్రి లేదు।।

హుండీలేదు। చివరికా విగ్రహానికి రక్షణగా గదిలా కట్టిన తాటాకులైనా లేవు।।



విగ్రహం మాత్రం మొదటి రోజు వొంటరిగా ఎలా నవ్వుతూ కనిపించిందో జనం చేతా, పెద్దలమనుకొనే వారిచేతా ఆరాధనలు పొందుతూ ఏ నవ్వుతో మురిపించిందో, యీ రోజున కూడా-తనకు వచ్చిన నడమంత్రపు సిరి పోయినా-అదే నవ్వుతో మిగిలిపోయింది.

నా మనసు బాధతో బరువెక్కింది.

యింతలో ఓ చేయి ఆప్యాయంగా నా భుజం తట్టింది.

శేఖరం!

"బాధపడుతున్నావా? ఎందుకోసం? ప్రజలకు నీ పొరపాటుతో భ్రాంతి కల్పించినందుకా? తర్వాత దాన్ని తెల్పుకొని ధైర్యంగా వప్పుకొన్నందుకా? లక్షరూపాయలు నువ్వివ్వు, లక్ష నేనిస్తా ఒకరి గొడవ మనకెందుకు; నువ్వనుకొన్న ప్రకారం ఆశ్రమం, శిక్షణా కేంద్రం నిర్మిద్దాం" అన్నాడు శేఖరం.

"శేఖరం! లక్ష రూపాయలిస్తావా!" ఆశ్చర్యపోయాను.

"నేను పిసినారివాడిని కాదు" నవ్వాడు శేఖరం.

"శేఖరం.... నిజం చెప్పు.... యీ విగ్రహం తనంతట తను వెలువలేదని నీకు ముందే తెల్సా? ఎవరు చెక్కారో కూడా తెల్సా?"

"ఎవరు చెక్కారో తెలియదు.... కానీ-విగ్రహాలు వెలవవని మాత్రం తెల్సు" అంటూ నా చేయి పట్టుకొని ఆప్యాయంగా నొక్కాడు శేఖరం.

"నువ్వు గొప్పవాడివి!" అన్నాను.

"యీ విగ్రహం శిల్పించిన వృద్ధుడు గొప్పవాడు. ముందు పొరపడినా, ధైర్యంగా దాన్ని వప్పుకొని మార్గదర్శకమైన నిర్ణయం తీసుకొన్న నువ్వు గొప్పవాడివి. నీలాంటి వారు చైతన్యం కలిగించకపోతే నావంటి చాలా మంది మరుగునపడే వుండిపోతారు....పద...." అంటూ కిందకు దిగసాగాడు శేఖరం!

* * *

ఆ రాత్రి తిరిగి కలగన్నాను-

ఈసారి ఆ స్త్రీ నవ్వుతూ నాకేసి పరిగెత్తుకొస్తున్నట్లు!

"నిన్ను గుర్తించానుగా" అన్నాను.

"గుర్తించడమే గాదు....నన్ను విడుదల చేస్తున్నావు కూడా" అంటూ ఛెంగు ఛెంగున ఎగురుతూ ముందుకు సాగిపోయింది. నాకు మెలకువ వచ్చింది.

ఔను! ఆమె మతపు చెరసాలలో బధించబడి కుష్కించిన భారతీయ శిల్పకళ!!

